కడుపు నిండింది



దీపావళి కథల పోటీలో
రూ. 600 బహుమతి పొందిన కథ

ఇంకా తెల్లవారలేదు. గోడగడియారం నాలుగు కొట్టింది.

"అమ్మగోరూ !.... అమ్మగోరూ...."

సరస్వతమ్మ ఉలిక్కిపడి లేచింది. కళ్ళు నలుపుకుంటూ వెళ్ళి తలుపు తీసింది. పని మనిషి బద్ధకంగా వొళ్ళు విరుచుకుంటోంది.

మర్నాడు పెందలకడే పనిలోకి రమ్మన్న సంగతి గుర్తొచ్చి తన మాట మన్నించిన పనిమనిషి స్వామి భక్తికి ఆశ్చర్యం వేసింది.

"పనిలోకి రానేదండమ్మగోరూ !... పండక్కాని అల్లుడోడూ, కూతురూ వొచ్చిరు. ఇయ్యాల ఇంటికాడనే వుండిపోవాల ఆ కబురు సెప్పిపోదామని వొచ్చినా..." కబురు చల్లగా చెప్పింది.

మరో రోజైతే సరస్వతమ్మ శాపనార్థాలు పెట్టివుండేదే ! ఈ పని మనుషుల విశ్వాస ఘాతుకత్వాన్ని దుయ్యబట్టి వుండేదే ! కాని ఇప్పటి మంచి ఆమె మారిన మనిషి. ప్రపంచం నిండా ఎక్కడ చూసినా మంచే కనిపిస్తోంది. కారణం ?

ఎప్పుడూ బావురు మంటూ వుండేయిల్లు పిల్లాజెల్లాతో కళ కళ లాడుతుండటం, తన వాళ్ళందరూ తన చుట్టూతా వుండటం.

"సరేలే ! నువ్వుమాత్రం ఏంజేస్తావ్ ? నీకూ పండుగే ! నీయింటే సాయంత్రం వోసారి కనిపించు. మిగిలినవి పట్టుకు పోదువుగాని" వీధి తలుపు గడియ వేసి తిన్నగా భర్త మంచం వద్దకొచ్చింది. ఇంత వయసొచ్చినా పసిపాపలా నిద్రపోగల ఆయన అదృష్టానికి నవ్వుకుంది. పండుగ పనులు మనసులో మెదిలేసరికి భయం వేసింది.

"మిమ్మల్నే !... లేవండీ...!"

"ఎందుకూ ?" ముసుగు తొలగించి బద్ధకంగా అన్నారు దశరథరామయ్య.

"పనిమనిషి రాదు... పండుగ రోజు... బోలెడు పనులు."

"ఉంటే నేనేం చెయ్యనూ ?"

"అయ్యో రామా ! ఏదయినా చెయ్యొచ్చు. లేచి కొంచెం బాయిలర్ అంటించండి. తరువాత నీళ్ళు పట్టండి. కొళాయి ఆగి పోతుంది. ఈలోపు నేను మిగతా పనులు చూసుకుంటాను."

దశరథరామయ్య నిద్రమత్తు వొదిలి పోయింది. తనకు దమ్మిడీ పని చెప్పని భార్య ఈ రోజీ పనులన్నీ పురమాయించడం లోని అవసరాన్ని గుర్తించాడు. వెంటనే లేచి కూర్చున్నాడు.

నిజానికి దశరథరామయ్య యిలాంటి యింటిపనులెన్నడూ చేసి ఎరుగడు. గెజిటెడ్ ఆఫీసరుగా పెన్షను పుచ్చుకుంటున్నాడు. ముక్కుసూటిగా నడిచి, నిజాయితీ గల ఆఫీసరుగా పేరు పొందాడు. అందువల్ల ఉద్యోగంలో కొంత నష్టపోయినా పిల్లలు నలుగురూ పైకొచ్చారు. ముగ్గురు కొడుకులూ, ఒక కూతురూనూ. ఒక్కరూ ప్రస్తుతం వెయ్యి మైళ్ళకు తక్కువ దూరంలో లేరు. పెద్ద కొడుకు ఆయిల్

ఇండియా లిమిటెడ్‌లో ఆఫీసరు. ప్రస్తుతం సిమ్లాలో వుంటున్నాడు. రెండో వాడు కోయంబత్తూరు ఇంజనీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్. మూడో వాడు ఎయిర్ ఫోర్స్‌లో ఫ్లయిట్ లెఫ్టినెంట్. జాగ్వార్ విమానాల ప్రత్యేక ట్రయినింగ్ కోసం ప్రస్తుతం ఇంగ్లండులో వున్నాడు. ఇంకా వివాహం కాలేదు. అల్లుడు తుంబా రాకెట్ కేంద్రంలో ఇంజనీరు. దశరథ రామయ్యకు విశాఖపట్నంలో స్వంత ఇల్లుంది. ఎవ్వరిమీదా ఆధారపడనవసరం లేనంత రాబడి వుంది. ఏ చీకూ చింతా లేదు. కాని ఇంకా బోలెడు వయసు మిగిలివుంది. అందుకే జీవితం ఏదో వెలితిగా చప్పగా వుంది.

దశరథరామయ్య విశాఖపట్నంలో స్థిరపడటం ఒక పథకంతోనే చేశాడు. తన పిల్లలు వుద్యోగరీత్యా దేశంలో ఎక్కడెక్కడ తిరిగినా వాళ్ల పిల్లల్ని తన దగ్గరుంచుకుని చదివించాలని కోరిక.

“ఇక్కడ మంచి స్కూళ్ళున్నాయ్రా! యూనివర్శిటీ వుంది. బ్రహ్మాండమైన స్టీల్ సిటీ కాబోతోంది. మీరెక్కడైనా తిరగండి, మీ పిల్లల్నిక్కడ నిశ్చింతగా వొదిలేసిపోండి. వాళ్ళ చదువు బాధ్యత నాది...” అని వీలయినప్పుడల్లా చిన్నసైజు లెక్చరిస్తుంటాడు. ఈ రకంగానయినా తన పిల్లలు తన దగ్గర లేని వెలితి తీరుతుందని ఆశ. అయినా ఒక్కరూ తమ పిల్లల్ని వొదిలేసి వెళ్ళడానికి ముందుకు రాలేదు. కారణాలు అనేకం. తల్లిదండ్రులు వాళ్ళమీద సరైన శ్రద్ధ తీసుకోరని మాత్రంకాదు. అందుకే కారణం వెదకడానికి సోషియాలజీ డిపార్ట్‌మెంటువారు ఒక స్టడీ చెయ్యాలి.

జనరేషన్ గేప్ అనో, ఫేమిలీ సిస్టమ్ ఇంకా ఇంకా కంపార్ట్‌మెంటలైజు కాబోతోందనో ఎట్సెట్రా ఎట్సెట్రా సిద్ధాంతీకరిస్తారు.

చివరికో ఏర్పాటు కుదిరింది. అదొక జంటిల్‌మెన్ అగ్రిమెంటు లాంటిది. దేశం నలుమూలలా వున్న పిల్లలందరూ తమ పిల్లాజెల్లాతోసహా సంవత్సరానికొకసారి— అందరూ ఒకేసారి — తమ వద్ద గడపాలి. ఇది తూ... చా... తప్పకుండా అందరూ పాటించవలసిన నిర్ణయం. ఎవరికీ అభ్యంతరంలేని నియమం. అయిదేళ్ళుగా అమలులో వున్న పద్ధతి. సంక్రాంతి పండుక్కి అందరూ కలవాలి.

ఎన్నడూ కాగితం మీద కలం పెట్ట సాహసించని సరస్వతమ్మ సంక్రాంతి ముందు మాత్రం తనే స్వయంగా అందరికీ వుత్తరాలు రాసుకుంటుంది. తల్లి ఆరాటం అర్థమవుతుంది గాబోలు, ఎన్ని యిబ్బందులున్నా ఈ పండక్కి రావలసిందే. ఈ పద్ధతి గుడ్డిలో మెల్ల అని సరిపెట్టుకుంది సరస్వతమ్మ.

* * *

బారెడు ప్రొద్దెక్కినా తలంట్లు పని పూర్తిగాక పోవటం సరస్వతమ్మ పని తెమలక పోవడం మాత్రం కాదు. పిల్లలు సహకరించక పోవటమే.

ఇదివర్లో ఇంట్లో ఒక కట్టుబాటుండేది. పండుగ రోజు తెల్లారేసరికల్లా స్నానాలు అయిపోవాలంటే అయిపోయేవి. పిల్లల్ని చదవండీ అంటే చదివేవారు. భోజనానికి రండిరా అంటే అందరూ వచ్చేశేవారు. మారుమాటుండేది గాదు. ఇంట్లో సరస్వతమ్మ నాయకత్వాన్ని అందరూ మన్నించేవారు. ఇప్పుడెవరి దారి వాళ్ళది. క్రొత్త అలవాట్లూ, కొత్త పద్ధతులూ కనిపిస్తున్నవి. ఇల్లొక మినియేచర్ ఇండియాలా వుంది. ఒక మనవడు తెలుగూ హిందీ కలిపి మాట్లాడితే మరో మనుమడు అరవంలో తెలుగు కలుపుతాడు. ఒక మనుమరాలు ఇంగ్లీషు తప్ప మరో భాష మాట్లాడదు! ఒకడికి బ్రెడ్డూ ఆమ్లెట్ కావాలి. మరొకడికి ఇడ్లీ సాంబార్. ఇంకొకడికి రసగుల్లాలు కావాలిట. ఇహ తన గోంగూర పచ్చడేం కాను ? సరే వీళ్లంతా ఎక్కడెక్కడో పెరుగుతున్నారు. కొంతవరకూ అర్థం చేసుకోవచ్చు. కాని తన స్వంతపిల్లలు, వీళ్లూ మారిపోవడమేమిటి ? వీళ్ళు చిన్నతనంలో ఇలా వుండేవారా? పాచి మొఖాలతో కాఫీత్రాగటమే ? ఈ దిక్కుమాలిన సంకరం అలవాట్లు అప్పుడుండేవా ? అసలు వీళ్ళు తన పిల్లలేనా ? అని అనిపించేంతగా మారిపోయారు.

మొత్తంమీద స్నానాలు. పూర్తయి ఫలహారాలయ్యేసరికి పదిన్నరయింది. 'హమ్మయ్య' ఒక ఘట్టం పూర్తయినందుకు సరస్వతమ్మ వూపిరి పీల్చుకుంది. కోడళ్ళు లాంఛనంగా వెళ్ళి అత్తగారికి వంటలో సాయం చెయ్యడానికి సిద్ధమయ్యారు.

“మీరేమీ చెయ్యక్కర్లేదు. మీ పనులు మీరు చేసుకోండి. అంతేచాలు అవుసరమయితే పిలుస్తాను” అంది సరస్వతమ్మ. అలా అంటుందని వాళ్ళకు ముందే తెలుసు. అత్తగారు తమని అతిథులుగానే చూసుకుంటుంది గాని తమతో పనులు చేయించి అత్తరికం చెలాయించే మనిషి కాదని వాళ్లకు తెలుసు. అందుకే సరస్వతమ్మ అంటే కోడళ్లకు గౌరవం. ఆమె మాటకు విలువ. అలాగని సరస్వతమ్మ కూడా తన అభిప్రాయాలను వాళ్లమీద ఎన్నడూ రుద్దలేదు. వాళ్ల సంసారాల్లో వాళ్ళకుపూర్తి స్వేచ్ఛనిచ్చింది.

సరస్వతమ్మ ఒక్కతే వంటింట్లో అష్టావధానం చేస్తోంది. కోడళ్ళూ, కూతురూ కలిసి ఒకచోటచేరి స్త్రీల సమస్యలు చర్చించుకుంటున్నారు. మగవాళ్లంతా ముందు వరండాలో చేరి రాజకీయాలు చర్చిస్తున్నారు. ఇరాన్‌లో అమెరికన్ బందీలు మొదలు పంచదార కేజీ పదిరూపాయల వరకూ విషయాలు దొర్లిపోతున్నాయి. పిల్లజనం ఇల్లు పీకి పందిరేస్తున్నారు.

“ఇంద కాఫీ...” అంటూ సరస్వతమ్మ కాఫీగ్లాసు భర్తకందించింది. దశరథరామయ్య ఆశ్చర్యపోయాడు. ఇంత తల మునక పనిలో కూడా తన పదకొండు గంటల కాఫీ సంగతామెకు గుర్తున్నందుకు. ఉద్యోగం వదిలినా అలవాట్లు మాత్రం పోలేదు.

“మీ మామగార్కి కాఫీమీదే వుంటుంది నాయనా! ప్రాణం” అంటూ అల్లుడికి వివరించింది.

“సిక్సర్...సిక్సర్ ...” అంటూ ప్రవేశించాడొక మనవడు, ట్రాన్సిస్టరు భుజానవేసుకుని.

“ఏమిట్రా అది ?”

దీపాలు !

కాలే కడుపే ప్రమిద
కారే కన్నీరే చమురు
నవనాడులే వత్తులు...
నిరాశా నిస్పృహలే నిప్పయి
వెలుగుతున్నాయి
నిరుపేదల కళ్లు
ఆ వెలుగులో వెతుకుతున్నాయి
సమతాభ్యుదయాల ఇండ్లు !

— తేజస్విత

"కపిల్ దేవ్ సిక్సర్ కొట్టాడు తాతయ్యా!"

"గుడ్ లెంగ్త్ బాల్...ఎండ్...ఎండ్... బ్యూటీఫుల్లీ డ్రివెన్ బై కపిల్‌దేవ్ టు ఆన్ సైడ్ బౌండరీ ఫర్ ఎనదర్ ఫోర్.." కామెంటేటర్ గోల పెట్టేస్తున్నాడు. సముద్ర ఘోషలా వుంది కామెంటరీ.

"బయటకిపోయి వినరా" కొడుకుని గదమాయించాడు జ్యేష్టుడు. ట్రాన్సిస్టర్ బయటకు వెళ్ళిపోయింది.

"క్యా దేఖు తే హో... సూరత్ తుమ్‌హారీ..." మరో మనవడు మరో ట్రాన్సిష్టర్‌తో ప్రవేశం.

"బాబూ! సునీల్... మీ నాయనమ్మకి మోతలు పడవురా! బయటకు పోయి విను" దశరథరామయ్యకు భార్య గుండెదడ గుర్తొచ్చింది. ఈ ధ్వనులు తనకే వుక్కిరిబిక్కిరిగా వున్నవి. వెంటనే వంటగదివైపు నడిచాడు.

సరస్వతమ్మ చెవులు గట్టిగా మూసుకుని గోడకు చేరబడి కూర్చుంది.

"అమ్మాయిని పిలవలేక పోయావా?"

"ఒద్దులెండి... మీరు కూర్చోండి..." దశరథరామయ్య పీటవేసుకుని కూర్చున్నాడు. భార్యవంక ఆశ్చర్యంగా చూశాడు. ఎప్పుడూ ముక్కుతూ మూల్గుతూ మరోసారి కాఫీ అడిగితే గుని సే మనిషికింత వోపికెలా గొచ్చిందో? వెంటనే భార్యమీద జాలికలిగింది.

"దడగా వుందా?..."

"లేదు."

కడుపు నిండింది

"నువ్వు మర్యాద చెయ్యలేదని ఎవ్వరూ అనుకోబోరు గాని, వూరికే వొళ్ళు హూనం చేసుకోకు."

"మీరు మరీనండీ..." నవ్వింది సరస్వతమ్మ నీరసంగా.

నిజానికి సరస్వతమ్మకు గుండెదడ విపరీతంగా వుంది. ఉక్కిరి బిక్కిరిగా భయంగా వుంది. అయినా వోపిక తెచ్చుకుని పనులన్నీ చేసుకుపోతోంది. తన పిల్లలకు తను స్వయంగా చేసిపెట్టుకుంటేనే ఆమెకుతృప్తి.

భోజనాలుపూర్తికావడంతో రెండో ఘట్టం పూర్తయిందని సరస్వతమ్మ మరోసారి 'హమ్మయ్య' అనుకుంది. ఒళ్ళంతా పులిసి పోయింది. అయిష్టంగానే భోజనం ముగించి నడుం వాల్చింది.

"బావగారూ! రమ్మీ ఆడదాం రండి. ప్రతిసారీ పండుక్కొచ్చి క్రొత్త బట్టలు తీసుకుపోవడం కాదు. ఈసారి మీ దగ్గర వసూలు చెయ్యందే వదల్ను..." అంటూ రెండోవాడు పేకదస్తాలు తీసుకొచ్చి ముందు పడేశాడు.

"ఉరేయ్ చిన్నన్నా! ఆయనకీ మధ్య క్లబ్బులో రమ్మీ 'విజర్డ్' అని బిరుదిచ్చి సత్కరించారు. గెలుచుకోబోయి పోగొట్టుకునేవు గాక" హెచ్చరించింది చెల్లెలు.

"సరే చూద్దాం!... అన్నయ్యా రా!... నాన్నగారూ మీరూ ఒక చెయ్యి...!"

"స్టేక్ ఎంతోయ్?"

"మీ యిష్టం బావగారూ! ఆ ఛాయిస్ మీది."

"పది పైసలు. అంటే కవుంట్ పది రూపాయలు. డ్రాప్ రెండు రూపాయలు. మిడిల్ డ్రాప్ నాలుగు..."

"సరే..."

"క్యాష్ డవున్ ప్లీజ్... అరువుల్లేవు." హెచ్చరించాడు రెండోవాడు అందర్నీ.

"ఒక ప్రతిపాదన!" ఇంటి ఆడబడుచు వంక అంతా చూశారు.

"ఎవరు గెలిచినా డబ్బు నాకు రావాలి."

"ఇదెక్కడి న్యాయం తల్లీ!" కోడళ్ళిద్దరూనూ.

"చెబుతాను,కొంచెం ఓపికపట్టండిమరి."

"చెప్పు! ఎలాగైనా మీ ఆయన ఓడిపోతాడని భయమా?"

"అలాంటి భయం లేదుగాని వదినలూ వినండి. సస్పెన్సెందుకుగాని ఆ గెలిచిన డబ్బుతో అందర్నీ సినిమాకు తీసుకెడతాను."

మధ్యాహ్నం అంతా రమ్మీ జోరుగా సాగింది. ఎవరి భర్త దగ్గర కూర్చుని వాళ్ళు ఆడిస్తున్నారు పట్టుదలతో. సరస్వతమ్మకూ అక్కడ కూర్చోవాలనే వుంది. కాని సాయంత్రం టిఫిన్లు?

మొత్తం మీద రమ్మీవిజర్డ్ అల్లుడిగారి డవున్‌గా వుంది. కాఫీ, టిఫిన్లు పేకాటవద్దకే చేరాయి. అంతా హుషారు, నవ్వులు కేరింతలు.

"షోస్ !..."

దశరథరామయ్య సంతకంచేసి అందుకున్నాడు. ఇంగ్లండు నుండి కేబుల్ అది. మూడోవాడు అందరికీ గ్రీటింగ్స్ పంపించాడు. సంతోషంతో నోట మాట లేదు సరస్వతమ్మకు. వాడు లేని వెలితిని ఈ కేబుల్ కొంతవరకూ తీర్చింది.

మరో అరగంట పేకాట సాగింది.

"స్టాప్ ప్లీజ్..." అంటూ అందరూ పోగొట్టుకున్న పూల్డ్ డబ్బుని లెక్కచూసింది ఆడబడుచు. ఎనభై అయిదు రూపాయల చిల్లర తేలింది.

"పధ్నాలుగు సినిమా టిక్కెట్లకీ, పధ్నాలుగు థమ్సప్‌కీ, పధ్నాలుగు పాప్‌కారన్‌కి సరిపోతుంది. ఇక లేవండి ప్లీజ్. అందరూ అరగంటలో తయారవ్వాలి. ఆనక సినిమా టిక్కెట్లు దొరకవు" అంటూ ఆడబడుచు పేకదస్తాలు తీసుకుంది.



"పద్నాలుగురా ? మై గాడ్..." అంటూ హెడ్స్ కవుంట్ మొదలుపెట్టాడొక మనవడు.

"కరెక్ట్! తాతయ్యా నానమ్మలతో పధ్నాలుగురే" ధృవపరచిందొక మనవరాలు.

పదినిముషాల్లో అందరూతయారయ్యారు. వృద్ధ దంపతులు మాత్రం ఇంటిపట్టునే వుండిపోయారు. వరసగా మెట్లు దిగుతున్న తన బలగాన్ని చూసుకుని మురిసిపోయారు. తిరిగొచ్చాక వాళ్ళందరికీ దిష్టి తియ్యాలను కుంది సరస్వతమ్మ.

సరస్వతమ్మ రాత్రి వంట ప్రయత్నంలో వుంది. భర్త వంటింట్లో తోడుగా వుంటే ఎంతపనైనా సులువుగా చేసుకుపోగలదు.

"సింపుల్‌గా కానిచ్చెయ్యి..."

"మీరూరుకోండి. నేనేంకష్టపడిపోవటం లేదు. సంవత్సరానికి నాలుగైదు రోజుల భాగ్యం. తరువాత మీరూ నేనేగా మిగిలేది. పూర్తి విశ్రాంతేగా ?"

"నువ్వొట్టి పిచ్చిమొద్దువి. పిల్లలతో చెప్పి చేయించుకోవడం చేతగాదు. నలుగురికి నాలుగు పనులు పురమాయిస్తే తేలిగ్గా అయిపోతుందిగా?"

"వాళ్ళంతా సరదాగా గడపడానికొచ్చారు. వాళ్ళకు పనులు పురమాయించనా? చాల్లే వూరుకోండి..."

"వాళ్ళతో చేయించుకోవడం ఇష్టం లేకపోతే నువ్వు చెయ్యగలిగినంతే చెయ్యి..."

"నా తృప్తికోసం అని వూరుకుందురూ. వూరికే సతాయించక."

"ఏమిటో నీ పిచ్చి నీ కానందం !"

"నాది పిచ్చేగాని... ఏమండీ! వాళ్ళంతా

కడుపు నిండింది

వచ్చాక మీరు కూడా చిన్నమెత్తు పని ముట్టరు. బోలెడు అభిమానం. అందుకే అ మంచాలూ గట్రా యిప్పుడే వాల్చగూడదూ? ఆనక ఆపని నామీద వెయ్యకపోతే ?"

'నిజమే సుమా' అనిపించింది దశరథ రామయ్యకు. వెంటనే ఆ పని అందుకున్నాడు.

పనులన్నీ పూర్తయేసరికి రాత్రి తొమ్మి దయింది. పిల్లల రాకకోసం ఎదురుచూస్తూ వరండాలో కూర్చున్నారు దంపతులిద్దరూ.

అపురూపురుమంటూ వచ్చారు అందరూ. వెళ్ళేప్పుడున్న సరదా ముఖాల్లో ఇప్పుడు కనిపించడం లేదు. బట్టలు మార్చి భోజ నాలకు సిద్ధమయ్యారు. సరస్వతమ్మ వడ్డన ప్రారంభించింది.

"సినిమా ఎలాగుందిరా సీనూ?" ఒక మనవణ్ణడిగాడు.

"గొప్ప బోర్ తాతయ్యా! సినిమా అంతా లవ్వే." అంతా నవ్వేశారు.

"అయితే సినిమా ఎలాగుండాలంటావ్?"

"ఫైటింగ్... డిషుం... డిషుం..."

"వాడికో ధర్మసందేహం నాన్నా" అంది కూతురు.

"యన్. టి. రామారావూ, అమితాబ్ బచన్ ఫైటింగ్ చేస్తే ఎవరు గెలుస్తా రని ?" అంతా మరోసారి నవ్వేశారు. సరస్వతమ్మ కూడా హాయిగా నవ్వుతూ వడ్డిస్తోంది.

"బావగారూ! తినండి...తినండి... మళ్ళీ సంవత్సరం వరకూ ఇలాంటి పులావ్ దొర కదు" అన్నాడు రెండోవాడు. చెల్లెళ్ళని ఆట పట్టించడం అతని హాబీ.

"ఇన్సల్ట్‌రా చిన్నన్నా! అంటె నాకేం చేతగాదనేగా ?"

"అలా అన్నానా ? కాని బావగారు నిన్నటి నుండీ అపురూపురు మంటూ తినడమే నీ పాక పాండిత్యానికి బుజువు."

"కరెక్ట్..." అంగీకరించాడు అల్లుడు మరి కొంచెం పులావు వేయించుకుంటూ.

"బావగారూ ! మీ రేమీ అనుకోనంటే ఒక విషయం అడుగుతాను."

"అడగవోయ్ !... అడుగు ... సందేహం దేనికి ?"

"మీరు చదువుతున్న రోజుల్లో కాలేజి హాస్టల్లో ఈటింగ్ పోటీల్లో ప్రథమ బహుమతి మీదేనని విన్నాను ? ఈ మధ్యనే తెలిసిందిలెండి..."

"అంతేనా నీకు తెలిసింది ?"

"అంత బొత్తిగా కొట్టిపారెయ్యకండి మరి ! అందులో నాకూ అంతో యింతో ఘనత లేకపోలేదు."

"అయితే నాతో పోటీ కొస్తావా ?"

"ఎంత పందెం ?"

"రేపు సినిమా ఖర్చు."

"ఓకే ! వడ్డించమ్మా !" అందరూ హార్దిగ్గా నవ్వుకున్నారు. పిన్నలూ పెద్దలూ పందేలు వేసుకుని మరీ తిన్నారు. పులావు గిన్నె ఖాళీ. పెరుగు ఆవడలు ఖతమ్. సేమ్యాపాయసం నిండుకుంది. కూరలు, అన్నం, సాంబారు, రసం అన్నీ ఖాళీ.

"బావగారూ ! నేనోడిపోయాను."

"హురే ! హిప్...హిప్...హుర్రే..."





పు వ్వు ల ది వ్వె లు

దీపావళి
దివ్వెల వరుసలు
ప్రతి ఇంటా
వెలుగులు
విరజిమ్ముతున్నాయి
వెన్నెల్లో విరిసిన
సిరిమల్లెల పువ్వుల
దివ్వెల్లా
ప్రతివాకిటా వెలిసాయి
బాణాసంచా
చిటపటల చిరునవ్వుల్లా
నరకాసురిని కది కటిక
చీకటి రాత్రిలా
నరులకది వెన్నెల రాత్రిలా
నవ్వుల పువ్వులు
రువ్వుతూ వెలిగిపోతోంది
దీపావళి

— ఎల్. పి. చంద్ర

కడుపు నిండింది

పిల్లలంతా గంతులేశారు. అంతా నవ్వులు, ఆనందం, కేరింతలు, భుకా యాసం.

అంతా బయట వరండాలో కూర్చుని తాంబూలాలు వేసుకుంటున్నారు. పిల్లలు బాత్‌రూం ఖాళీకోసం పోటీలు పడుతున్నారు. సరస్వతమ్మ వంటిల్లు సర్దటంలో మునిగి పోయింది.

గడియారం పదకొండు కొట్టింది.

ఇల్లంతా నిశ్శబ్దం. ఎవరిగదుల్లో వాళ్ళు నర్దుకున్నారు. దశరథరామయ్య ఒక్కడూ వరండాలో కూర్చున్నాడు. ఎందుకో మనసు చికాగ్గా వుంది. చుట్టూరా ఆనందం పరవళ్ళు త్రొక్కుతున్నపుడు ఈ అప్రశుతేమిటి ? ఆయన గుండెల్ని ఎవరో పట్టి పిండినట్లుగా వుంది. వంటింట్లోకి నడిచాడు. ఫ్రిజ్ తెరచి చూశాడు. ఖాళీగా వుంది.

సరస్వతమ్మ వంటిల్లు సర్దటం పూర్తిచేసి రెండు గ్లాసులు మంచినీళ్ళు తృప్తిగా త్రాగింది.

"మీరింకా పడుకోలేదూ ?"

"చూడు పిచ్చిమొద్దూ! పొట్టిశ్రీరాములు 58 రోజుల నిరాహారదీక్ష తరువాత గాని చచ్చిపోలేదు. ఒక్కపూట భోజనం మానేసి నంత మాత్రాన మనుషులు చచ్చిపోరనీ నాకు తెలుసు. అయినా ఇంత బలగం వుండి నువ్వు తిన్నావా ? లేదా ? అని ఎవరికీ అనిపించక పోవటమే నాకు అర్థంకాని విషయం..."

"ఏమిటండీ ? మీరనేది ?"

"ఏమీలేదు. నువ్వుతినడానికేమీ మిగల్లేదు. ఇప్పుడు చేసుకునే వోపికా లేదు. అయినా నీ కడుపు నిండుగా వుంది కదూ... ?"

"అయ్యో ! నేను భోంచెయ్యక పోవడ మేమిటి ?"

"అబద్ధం చెప్పకు..."

"అయ్యోరామా ?..."

"ఆ ఫ్లాస్కు ఇలాతే. హోటలుకుపోయి ఓ బన్నురొట్టి, పాలూ తెసా ను."

"ఈ వేళప్పుడెందుకండీ ఇవన్నీనూ ? నా కడుపు నిండుగా వుంది..."

"అవును ! కడుపు నిండింది" అంటూ ఫ్లాస్కు తీసుకుని విసురుగా బయటికి నడిచాడు దశరథరామయ్య.

అందుకోసమే ప్రొటీన్లతో నిండిన
హాలో ఎగ్ షాంపూ

తగినంత పోషణ లేకపోతే, మీ జుట్టు పల్చగా, నిర్జీవంగా వెలవెల పోతూ కనిపించవచ్చు. మొఖమల్‌లా మెరిసే బంగారు రంగు గల మృదువైన హేలో ఎగ్ షాంపూ, తన ప్రొటీన్ సమృద్ధమైన పోషక సూత్రీకరణతో మీ జుట్టును మళ్లీ అందంగా తీర్చి దిద్దుతుంది. దానికి కావలసిన పౌష్టిక తత్వం అంతా ఇస్తుంది. మీ జుట్టు హేలో ఎగ్ షాంపూ యొక్క పాల మీగడలాంటి నురుగు మీ జుట్టులోకి చొచ్చుకు పోయి, దాన్ని సజీవంగా, శుభ్రంగా మిలమిల మెరిసేలా చేస్తుంది.

హేలో ఎగ్ షాంపూ...
దట్టమైన, మరింత దట్టమైన జుట్టు కోసం.

HES.G.6 TL